శిథిలావస్థలో శ్మశాన వాటిక

మాల్తుమ్మెదలోని శ్మశాన వాటిక

మేజర్‌వాడి శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలతో నిండిన గదులు

- పాడుబడుతున్న భవనాలు, సామగ్రి
- చోరీ అవుతున్న స్తంభాలు, తీగలు
- పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలు

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 22: గ్రామాల్లో అంతిమ సంస్కారాలకు ఇబ్బందులు ఎదురుకావొద్దనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన శ్మశాన వాటికలను నిర్మించింది. ఒక్కో గ్రామంలో రూ.11.80లక్షల వ్యయంతో మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో శ్మశాన వాటికలను ఏర్పాటుచేశారు. కానీ నేడు వాటి ఆలనా పాలనా చూసేవారు లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అనువైన స్థలాన్ని ఎంపికచేసి రెండు రేకుల షెడ్లను నిర్మించారు. కార్యాలయంతోపాటు హాల్, స్నానపు గదులు, వాష్ రూమ్‌లు, మరుగుదొడ్లు నిర్మించారు. బోరు మోటరు, స్వాగత తోరణం, శవాలను దహనం చేసేందుకు ప్లాట్‌ఫామ్‌లు, చుట్టూ స్తంభాలు ఏర్పాటుచేసి రక్షణ కోసం ఏడు ఫీట్ల ఎత్తులో కంచెను ఏర్పాటుచేశారు. పచ్చని చెట్లు, కూర్చోడానికి బల్లలను సమకూర్చారు. బాధతో వచ్చిన వారు అక్కడికి రాగానే బాధను మరిచిపోయేలా నిర్మించగా.. నేడు ఆదరణ కరువై భవనాల తలుపులకు చెదలు, తుప్పు పడుతున్నాయి. విలువైన వస్తువులు చోరీ అవుతున్నాయి. శ్మశానవాటిక చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. స్తంభాలు, తీగలు ధ్వంసానికి గురవుతున్నాయి. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాల్తుమ్మెద శ్మశాన వాటికలో దహన సంస్కారాల గద్దె చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు


మాల్తుమ్మెదలో ఇదీ పరిస్థితి

బాన్సువాడలో 'ఆధారభూత కేంద్రీయ విషయాల వర్గ'

బాన్సువాడ, సెప్టెంబర్ 22: బాన్సువాడలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం ఆధారభూతకేంద్రీయ విషయాల వర్గను నిర్వహించారు. ఇందూర్ విభాగ్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిరాల ప్రధానచార్యులు, ఆచార్యులు, మాతాజీలు పాల్గొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూర్ విభాగ్ వ్యవస్థ ప్రముఖ్, శైక్షానిక్ ప్రముఖ్ పక్కి శ్రీనివాస్ మార్గనిర్దేశనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు నాగులగామ వెంకన్న, కార్యదర్శి సిర్న దత్తన్న, ధర్మ జాగరణ ప్రముఖ్ గంగన్న, జిల్లా కోశాధికారి బెజుగం సత్యనారాయణ, వివిధ పాఠశాలల ప్రధానాచార్యులు, ఆచార్యులు, మాతాజీలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వక్త సత్యనారాయణ

మిషన్ భగీరథ నీరు వృథా

పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

బిచ్కుంద, సెప్టెంబర్ 22: బిచ్కుందలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకవడంతో నీరు వృథాగా పోతున్నది. పాత ఆర్య సమాజ్ బిల్డింగ్ వద్ద డ్రైనేజీలో ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి నీరు వృథాగా డ్రైనేజీలో కలుస్తున్నదని కాలనీవాసులు తెలిపారు. వారం రోజుల నుంచి నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

ముగిసిన వినాయక నిమజ్జనం

బస్వన్నపల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న యువకులు

రాజంపేట్, సెప్టెంబర్ 22: మండలంలోని బస్వన్నపల్లిలో రెడ్డి పరివార్, పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుల నిమజ్జనం శనివారం రాత్రి ప్రారంభమై ఆదివారం ముగిసింది. గ్రామంలోని ప్రధాన వీధుల్లో శోభాయాత్రను నిర్వహించారు. చిన్నాపెద్ద తేడా లేకుండా నృత్యం చేశారు. బస్వన్నగుట్ట వద్ద ఉన్న కుంటలో నిమజ్జనం చేశారు.

కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

బీబీపేట్, సెప్టెంబర్ 22: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గోజు రియో కరాటే ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ సంస్థ గ్రాండ్‌మాస్టర్ కామిండ్ల రాజయ్య సమక్షంలో కరాటేలో బెల్ట్ టెస్ట్ పోటీలను ఇటీవల దోమకొండలో నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బెల్ట్ పరీక్షలో సత్తా చాటిన తొమ్మిది మంది విద్యార్థులకు కరాటే మాస్టర్ హరిప్రసాద్ తుజాల్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రుత్విక్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక..

దోమకొండ మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన రుత్విక అండర్-42 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో ఆమెను ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కరాటే మాస్టర్ హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా రిత్విక్‌ను గోజు రియో కరాటే ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ సంస్థ గ్రాండ్ మాస్టర్ కామిండ్ల రాజయ్య, కరాటే బ్లాక్ బెల్ట్ మాస్టర్లు కామిండ్ల నవీన్, హరిప్రసాద్ తదితరులు అభినందించారు.

అంబేద్కర్ యువజన సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 22: అంబేద్కర్ యువజన సంఘం ఎల్లారెడ్డి మండల నూతన కార్యవర్గాన్ని శనివారం రాత్రి ఎన్నుకున్నారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన సభ్యులకు అంబేద్కర్ యువజన సంఘం ఎల్లారెడ్డి నియోజక వర్గ ఇన్‌చార్జి బిట్ల సురేందర్ అభినందనలు తెలిపారు. మండల అధ్యక్షుడిగా అమృతరావు, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంజీవులు, ఎల్లారెడ్డి మండల ఉపాధ్యక్షులుగా రవి, పద్మారావు, ప్రధాన కార్యదర్శిగా సాయిలు, సంయుక్త కార్యదర్శులుగా ప్రకాశ్, వెంకట్, కోశాధికారిగా మొగులయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అంబేద్కర్ గ్రామ యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం ఎల్లారెడ్డి మండలం నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

సెకండరీ గ్రేడ్ టీచర్స్ జిల్లా కార్యవర్గం..

కామారెడ్డి, సెప్టెంబర్ 22: కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్జీటీల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా రాములు, కో-కన్వీనర్‌గా స్వామి, కార్యవర్గ సభ్యులుగా అయ్యాల సంతోష్, సంగమేశ్వర్, విజయ్, భవాని, సుజాత, వీణ, రమేశ్, రాజేందర్, దామోదర్, అంజనీ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను ఎస్జీటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, ఎన్నికల అధికారిగా వ్యవహరించిన నిజామాబాద్ జిల్లా కన్వీనర్ వెంకటరమణ, రాష్ట్ర బాధ్యులు మల్లికార్జున్,ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్జీటీల సమస్యలపై పోరాడుతామని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

ఎస్జీటీల జిల్లా కార్యవర్గ సభ్యులు

జోరుగా సాగుతున్న రహదారి విస్తరణ పనులు

పోచారం వద్ద డ్రైనేజీ ఏర్పాటు కోసం మట్టిని తొలగిస్తున్న హిటాచీ

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 22: పోచారం గ్రామం నుంచి మండల కేంద్రం గోపాలిపేట వరకు నూతన రహదారి పనులు మమ్మురంగా కొనసాగుతున్నాయి. పోచారం వద్ద రోడ్డుకు ఇరుపక్కలా రహదారికి ఆనుకొని అండర్‌డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. మాల్తుమ్మెద వద్ద రోడ్డుకు ఇరువైపులా మట్టి తొలగింపు పనులు చేస్తున్నారు. మండల కేంద్రంలో చెట్లను తొలగించారు. నూతన స్తంభాల ఏర్పాటుతోపాటు ఒక పక్కన అండర్‌డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. దీంతో ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నది.

'ధరణి' ప్లాట్లలో వసతులు కల్పించాలి

యజమానుల డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న ప్లాట్ల యజమానులు

కామారెడ్డి, సెప్టెంబర్ 22: కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ధరణి వెంచర్‌లో వసతులు కల్పించాలని ప్లాట్లు కొన్న యాజమానులు కోరారు. ప్లాట్ల వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ధరణి వెంచర్‌లో రోడ్డు, నీరు, విద్యుత్ వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓపెన్ యాక్షన్ ద్వారా ప్లాట్లు కొనుగోలు చేసి దాదాపు రూ.70 కోట్లు ప్రభుత్వ ఖజానాకు చెల్లించినప్పటికీ, రెండున్నర సంవత్సరాలుగా తాము ఇండ్లు నిర్మించుకున్నా వాటిలో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాట్ కొన్న వాటికి ఈఎంఐలు చెల్లించలేక, అద్దె ఇళ్లలో ఉండలేక తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నామని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ధరణి వెంచర్‌లో ప్లాట్లు, ఇండ్లను కొనుగోలు చేసిన వారు పాల్గొన్నారు.

ఘనంగా పీడీఎస్‌యూ 50ఏండ్ల ఆత్మీయ సమ్మేళనం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డి, సెప్టెంబర్ 22 : కామారెడ్డిలోని కర్షక్ బీఈడీ కళాశాలలో ఆదివారం పీడీఎస్‌యూ 50 వసంతాల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా మాజీ సహాయ కార్యదర్శి బలరాం చవాన్, జగన్నాథ్, శ్యాంరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోట్లాది మందిలో చలనాన్ని అందించిన పోరుబాటలో నడిచిన సంస్థ పీడీఎస్‌యూ అని అన్నారు. విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ 50 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నదని తెలిపారు. అనంతరం ఈనెల 30వతేదీన రాష్ట్ర స్థాయిలో ఉస్మానియా యూనివర్సిటీలోని ఆడిటోరియంలో నిర్వహించే వార్షికోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న 1992-94 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు

బాన్సువాడ, సెప్టెంబర్ 22: బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 1992-1994 విద్యాసంవత్సరంలో చదివిన సైన్స్ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పట్లో కాలేజీలో చేసిన అల్లర్లు, చిలిపి చేష్టలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన అధ్యాపకులను సన్మానించారు. సమ్మేళనంలో మాజీ వార్డుమెంబర్ ప్రసాద్, మాజీ ఎంపీటీసీ డాకయ్య, మనోహర్, భాస్కర్ శర్మ, డి.కృష్ణారెడ్డి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ఎన్నిక

బాశెట్టి నాగేశ్వర్

బీబీపేట్, సెప్టెంబర్ 22: ఆర్యవైశ్య మహాసభ కామారెడ్డి డివిజన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు బీబీపేట మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య కామారెడ్డి డివిజన్ నూతన అధ్యక్షుడు బాశెట్టి నాగేశ్వర్ తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా దుద్దెల ప్రసాద్ (బీబీపేట్), కార్యవర్గ సభ్యుడిగా తాడిపల్లి రమేశ్, ఆర్యవైశ్య సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా పబ్బ యాదగిరి ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నేడు (సోమవారం) ఎల్లారెడ్డి పట్టణంలో ఉంటుందని జిల్లాలోని ఆర్యవైశ్యులు హాజరు కావాలని కామారెడ్డి డివిజన్ నూతన అధ్యక్షుడు బాశెట్టి నాగేశ్వర్ కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★అనఘ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్ (M/F) Sal:15000/- అనుభవం గల ఎలక్ట్రిషియన్ (డిప్లొమ ఎలక్ట్రిషియన్) Sal:15000/- month మరియు సెక్యూరిటీ గార్డ్స్ (M/F) Sal:12000/- month కావలెను. ఆసక్తి గలవారు వెంటనే I.D. ప్రూఫ్, ఫోటోతో సంప్రదించండి. అనఘ షాపింగ్ మాల్, R.P రోడ్, నిజామాబాద్
NTZ-334461

వెంటనే కావలెను

★వ్యవసాయరంగంలో అనుభవం మరియు డ్రోన్ స్ప్రే యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించి ఒప్పించగలిగే నైపుణ్యం కలిగిన ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ప్రదేశం: సంగారెడ్డి, కామారెడ్డి, సం॥ సెల్: 9032527297
NTZ-334401

వెంటనే కావలెను

★Small/Medium తరహా DGCA సర్టిఫికేట్ కలిగి ఉండి 1 సంవత్సర అనుభవం కలిగిన అగ్రిడ్రోన్ పైలట్ కావలెను. విద్యార్హత ఇంటర్మీడియట్ / డిగ్రీ కలిగినవారు సంప్రదించండి సెల్: 9032527297
NTZ-334402

PASSPORT LOST

★I, NARAPAKA SWAMY S/o. NARAPAKA GANGARAM R/o. H.No.1-77/4/7, Vill: Donkal, Mdl: Morthad, Dist. Nizamabad, T.G. I Lost my original Passport No.Y9761151 Date of Issue 04-10-2023 Date of Expiry 03-10-2033 place of Issue Hyderabad It was Misplaced on 17-09-2024 while the travelling by Bike from Donkal to Armoor If anybody found please contact 76710 43748
NTZ-340297

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

ద్విచక్ర వాహనం చోరీ

లింగంపేట, సెప్టెంబర్ 22: లింగంపేటలో ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు బాధితుడు కుర్మ రాములు తెలిపారు. మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన రాములు మూడు రోజుల క్రితం లింగంపేట బస్టాండ్ ఆవరణలోని పెట్రోల్ పంపులో టీఎస్ 17ఈజే 2937 నంబరు గల హెచ్ఎఫ్ డీలక్స్ వాహనం పార్కింగ్ చేసి కామారెడ్డికి పని నిమిత్తం వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి వాహనం కనిపించలేదన్నారు. చుట్టుపక్కల గాలించినా బైక్ కనిపించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వాహనం ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని బాధితుడు రాములు కోరారు.

రైతు భరోసా నిధులను విడుదల చేయాలి

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 22: ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని జడ్పీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి మనోహర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని కోరారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో అనేక మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హామీలను అమలు చేయకపోతే రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

లింగంపేటలో గ్రామ సింహాల బెడద

లింగంపేటలో సంచరిస్తున్న శునకాలు

లింగంపేట, సెప్టెంబర్ 22: లింగంపేటలో గ్రామ సింహాల (కుక్కల) బెడద ఎక్కువైంది. బస్టాండ్ ప్రాంతంతోపాటు గ్రామంలోని పలు వీధుల్లో కుక్కలు పదుల సంఖ్యలో సంచరిస్తున్నాయి. వాహనాలపై వెళ్తున్న వారిని కుక్కలు వెంబడిస్తున్నాయి. చిన్నారులు ఆరుబయట తిరగడానికి జంకుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'కామారెడ్డికి బస్సు సౌకర్యం కల్పించండి'

లింగంపేట, సెప్టెంబర్ 22: మండలంలోని ముంబాజీపేట, భవానీపేట గ్రామాల నుంచి లింగంపేట మీదుగా జిల్లా కేంద్రం కామారెడ్డికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతంలో కామారెడ్డి నుంచి లింగంపేట, లక్ష్మాపూర్ గ్రామం మీదుగా భవానీపేట, ముంబాజీపేట, కంచుమహల్, కొండాపూర్, జల్దిపల్లి, రాంపూర్, ముంబాజీపేట తండాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యం ఉండేదని గ్రామస్తులు తెలిపారు. బస్సు రద్దు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు బస్సును ప్రారంభించలేదన్నారు. ఆయా గ్రామాల ప్రజలు కామారెడ్డికి చేరుకోవడానికి బస్సు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబర్ 22: పెద్దకొడప్‌గల్‌లో అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుకున్న ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగించామని తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి

బీబీపేట్, సెప్టెంబర్ 22: ఉద్యోగులకు రావాల్సిన నాలుగు పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం దోమకొండ బ్లాక్ ప్రధాన కార్యదర్శి నిజ్జని శ్రీకాంత్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూలై 2022 నుంచి జూలై 2024 వరకు డీఏలు రావాల్సి ఉన్నదని పేర్కొన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలను దృష్టిలో ఉంచుకొని పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గ్రామాల్లో సమస్యలను గుర్తించాలి

లింగంపేట, సెప్టెంబర్ 22: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. మండలంలోని అయ్యపల్లి, అయ్యపల్లి తండా, బోనాల్, మెంగారం గ్రామాల్లో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమస్యలను అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతో మందుల పిచికారీ

కొల్లూర్ శివారులో డ్రోన్ సహాయంతో మందును పిచికారీ చేస్తున్న రైతు

బాన్సువాడ, సెప్టెంబర్ 22: వరి పంటకు ఎండాకు తెగుళ్లు వ్యాపించింది. దీంతో రైతులు ఆధునిక సాంకేతికను ఉపయోగించి మందులను పిచికారీ చేస్తున్నారు. మండలంలోని కొల్లూరు గ్రామ శివారులో రైతులు వరికి డ్రోన్ సహాయంతో రసాయనిక ఎరువులను ఆదివారం పిచికారీ చేశారు.

ప్రభుత్వ దవాఖానలో రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న యువకుడు

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 22: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని బాన్సువాడ ప్రభుత్వ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఆదివారం హ్యూమానిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 36 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు మౌలాన్ రిజ్వాన్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు షకీల్, రిజ్వాన్, అక్బర్, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ సాకేత్ వర్మ, పీఆర్వో ఆనంద్, ల్యాబ్ టెక్నీషియన్లు రాఘవేందర్, ఎబినైజర్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.